నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, మంగళవారం 28 మే 2024 SANGAREDDY

ఓటు వేసేందుకు రిక్షాలో వచ్చి...

వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఉపఎన్నికతో ఓటుహక్కును వినియోగించుకునేందుకు చేర్యాల పట్టణానికి చెందిన దివ్యాంగురాలు రాజేశ్వరి హైదరాబాద్ నుంచి చేర్యాలకు వచ్చింది. ఇంటి నుంచి కేంద్రానికి రిక్షాలో వచ్చి ఓటుహక్కు వినియోగించుకుంది. ఎన్నికల అధికారులు ఎలాంటి వసతులు ఏర్పాటు చేయకపోవడంతో దివ్యాంగులు, సీనియర్ గ్రాడ్యుయేట్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. – చేర్యాల, మే 27

సిద్దిపేట జిల్లా చేర్యాలలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

ఓటెత్తిన పట్టభద్రులు

ఎమ్మెల్సీ ఉపఎన్నికలో సిద్దిపేట జిల్లాలో 76.13శాతం పోలింగ్

- 4,679 ఓట్లకు పోలైనవి 3,562
- 2,353 పురుషులు, 1,209 మహిళలు ఓటుహక్కు వినియోగించుకున్నారు...
- ఉదయం నుంచే బారులుదీరిన పట్టభద్రులు
- అత్యధికంగా కొమురవెల్లిలో 86.58శాతం
- అత్యల్పంగా చేర్యాల(1) కేంద్రంలో 71.61 శాతం నమోదు
- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సిద్దిపేట జిల్లా ఎన్నికల అధికారి
- పోలింగ్ సరళిని తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాలలో బీఆర్ఎస్ నాయకులతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సిద్దిపేట సీపీ అనురాధ

చేర్యాల: చిన్నారులతో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసిన మహిళా పట్టభద్రులు

కొమురవెల్లిలో ఓటు వేసిన పట్టభద్రులు

మద్దూరు: ధూళిమిట్టలో ఓటు వేసేందుకు బారులుదీరిన పట్టభద్రులు



సిద్దిపేట జిల్లా చేర్యాలలో మొదటి పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులుదీరిన పట్టభద్రులు

చేర్యాల, మే 27: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఉప ఎన్నికలో 76.13 శాతం పోలింగ్ నమోదైంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన గ్రాడ్యుయేట్లు పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్ శాతం భారీగా నమోదైంది. పట్టభద్రులు ఓటుహక్కును వినియోగించుకోవడంలో చైతన్యం చూపించారు. ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగానే పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూకట్టారు. పోలింగ్ సమయం 4గంటలకు ముగిసినప్పటికీ పట్టభద్రులు చేర్యాల, మద్దూరు పోలింగ్ కేంద్రాల్లో వేచి ఉన్నారు. పోలింగ్ కేంద్రం లోపల ఉన్నవారందరికీ ఎన్నికల అధికారులు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. సిద్దిపేట జిల్లాలోని జనగామ నియోజకవర్గం పరిధిలో మొత్తం 4,679 మంది పట్టభద్రుల్లో పురుషులు 3,122, మహిళలు 1,557 మంది ఉన్నారు. ఇందుకు చేర్యాలలో రెండు పోలింగ్ కేంద్రాలు, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండల కేంద్రాల్లో ఒక్కో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో 2353 మంది పురుషులు, 1209 మంది మహిళలు మొత్తం 3,562 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాలుగు మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండడంతో ఆయా సెంటర్లకు 100 మీటర్ల బయట రాజకీయ పార్టీల నాయకులు మోహరించి కేంద్రాలకు వచ్చే పట్టభద్రులను కలిసి తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. చేర్యాల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి మను చౌదరి, పోలీస్ కమిషనర్ అనురాధ సందర్శించి సంబంధిత అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకోవడంతోపాటు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులను కలిసి ఓటింగ్ ప్రక్రియ బీఆర్ఎస్ పార్టీకి గ్రాడ్యుయేట్స్ నుంచి వస్తున్న స్పందన తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి రాకేశ్‌రెడ్డి దంపతులు పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

మద్దూరు, ధూళిమిట్టలో ప్రశాంతం

మద్దూరు(ధూళిమిట్ట), మే 27: ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉపఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మద్దూరు పోలింగ్ కేంద్రం పరిధిలో 935 పట్టభద్రులు ఉండగా 733 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ధూళిమిట్ట పోలింగ్ పరిధిలో 511మంది పట్టభద్రులు ఉండగా, 408మంది ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ సాయంత్రం జోరందుకుంది. ధూళిమిట్ట పోలింగ్ కేంద్రాన్ని సిద్దిపేట సీపీ అనురాధ సందర్శించారు. మద్దూరు, ధూళిమిట్ట పోలింగ్ కేంద్రాలను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సందర్శించి, పోలింగ్ సరళిని పరిశీలించారు. స్థానిక నేతలతో మాట్లాడి గెలుపుపై ధీమాను వ్యక్తం చేశారు.

ఉదయం నుంచే బారులుదీరిన ఓటర్లు

సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలకేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు బారులుదీరారు. ఓటుహక్కును వినియోగించుకోవడానికి ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చి ఓటు వేశారు. ఉదయం 10 గంటలకు 11.03 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 33.19 శాతం, 2 గంటలకు 50.72 శాతం, సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 4 గంటల వరకు 69.82 శాతం నమోదైంది. చేర్యాల, మద్దూరులో పోలింగ్ సమయం ముగిసే వరకు క్యూలో నిలబడిన వారికి ఓటుహక్కు కల్పించారు. దీంతో పోలింగ్ శాతం 76.13 నమోదైనట్లు అధికారులు తెలిపారు. సిద్దిపేట జిల్లాలో అత్యధికంగా కొమురవెల్లి పోలింగ్ కేంద్రంలో 86.58 నమోదైంది. అత్యల్పంగా చేర్యాల(1) కేంద్రంలో 71.61 నమోదైంది. పోలింగ్‌లో పాల్గొనేందుకు పట్టభద్రులు సొంత వాహనాలు, బైక్‌లు, బస్సులు, ఆటోల్లో తరలివచ్చి క్యూలో ఉండి మరీ ఓట్లు వేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల అధికారులు పటిష్టమైన బందోబస్తు మధ్య ఆర్టీసీ బస్సులో సిద్దిపేట సమీకృత కలెక్టరేట్‌కు తరలించారు. అక్కడి నుంచి భారీ బందోబస్తు మధ్య నల్లగొండ జిల్లా కేంద్రానికి తీసుకుపోయారు.

చేర్యాలలో ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న జనగామ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

సిద్దిపేట జిల్లాలో 76.13శాతం పోలింగ్ నమోదు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం	పురుషులు	మహిళలు	మొత్తం	శాతం
					(పోలైన ఓట్లు)		
చేర్యాల(1)	784	474	1258	555	346	901	71.61
చేర్యాల (2)	902	395	1297	645	288	933	71.94
కొమురవెల్లి	447	231	678	385	202	587	86.58
మద్దూరు	643	292	935	493	240	733	78.40
ధూళిమిట్ట	346	165	511	275	133	408	79.84
మొత్తం	3122	1557	4679	2353	1209	3562	76.13

పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ శాతం ఇలా...

మండలం	పురుషులు	మహిళలు	శాతం	పురుషులు	మహిళలు	శాతం	పురుషులు	మహిళలు	శాతం	పురుషులు	మహిళలు	శాతం	పురుషులు	మహిళలు	శాతం
	(10గంటలకు)			(12 గంటలకు			(2గంటలకు)			(4గంటలకు)			(ఫైనల్ పోలింగ్ శాతం)		
చేర్యాల (1)	53	48	8.03	220	150	29.41	343	238	46.18	431	322	59.86	555	346	71.62
చేర్యాల (2)	119	39	12.18	262	223	37.39	334	238	44.10	564	261	63.61	645	288	71.94
కొమురవెల్లి	69	30	14.60	140	100	35.40	235	171	59.88	385	202	86.58	385	202	86.58
మద్దూరు	81	28	11.66	185	86	28.98	302	162	49.63	454	240	74.22	493	240	78.40
ధూళిమిట్ట	38	11	09.50	123	64	36.59	234	116	68.49	275	133	79.84	275	133	79.84
మొత్తం	360	156	11.03	930	623	33.19	1448	925	50.72	2109	1158	69.82	2353	1209	76.13

నెలాఖరులోగా కొనుగోళ్లు పూర్తి

రాయిలాపూర్ ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

- తడిసిన ధాన్యాన్ని కొంటాం
- రాయిలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన
- దామరచెర్వులో అమ్మ ఆదర్శ పాఠశాల పరిశీలన
- తహసీల్దార్, ఏవో, ఎంఈవోలకు సూచనలిచ్చిన మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట, మే 27: నెలాఖరులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామని, రైతులందరూ ధాన్నాన్ని తూకం వేయించుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామానికి చేరుకున్న కలెక్టర్ ముందుగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అక్కడ మాయిశ్చరైజింగ్ చేస్తున్న మిషన్‌ను పరిశీలించారు. అక్కడే ఉన్న తహసీల్దార్ రజినీకుమారి, ఏవో రాజ్ నారాయణకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొంటుందన్నారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను త్వరితగతిన తీసుకెళ్లాలని అక్కడే ఉన్న తహసీల్దార్, వ్యవసాయ శాఖ అధికారులకు తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి కావాలి

మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నడుస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మండల విద్యాధికారి నీలకంఠానికి కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. దామరచెర్వు గ్రామంలోని అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఎక్కడ ఏ గ్రామంలో పనులు నడుస్తున్నాయో నివేదిక ఇవ్వాలని ఎంఈవోకు సూచించారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తయితేనే జూన్ 12న విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చదువుకుంటారని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో వందశాతం విద్యార్థులు చదువుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల శాతం ఎక్కువ ఉంటేనే పాఠశాలకు అన్ని వసతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజినీకుమారి, ఎంఈవో నీలకంఠం, వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణ, సీఈవో నర్సింహులు తదితరులు ఉన్నారు.

ఆరు నెలలుగా జీతాలు లేవు.. ఎట్లా బతికేది?

- సఫాయి కార్మికులపై ప్రభుత్వానికి ఎందకు వివక్ష
- పంచాయతీ కార్మికుల ఆవేదన
- ఆదుకోవాలని వేడుకోలు

చేగుంట: ఆర్నెల్ల నుంచి జీతాలు అందక ఆవేదన వ్యక్తం చేస్తున్న సఫాయి కార్మికులు

చేగుంట, మే 27: ఆరు నెలలుగా జీతాలు లేవు.. మేమెట్లా బతికేది.. మాపై ప్రభుత్వం ఎందుకు కక్షగట్టింది.. అందరి ఉద్యోగులకు ఇచ్చినట్టు మాకు కూడా నెలనెలా ఇచ్చి ఆదుకోవాలని గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ సఫాయి కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూరీడు పొడవక ముందే ఇంటింటా తిరుగుతూ చెత్తబండి వచ్చిందమ్మా...తడి పొడిచెత్త వేరుచేసి ఇవ్వండమ్మా...అంటూ గ్రామంలో తిరుగుతూ ఊరును శుభ్రం చేస్తున్న సఫాయి కార్మికుల బాధలు వర్ణణాతీరం. పొద్దంతా కూలి పనిచేసి వచ్చిన డబ్బులతో పూట గడుపుకొనే ఈ రోజుల్లో... ఆరు నెలులుగా వారికి జీతాలు అందడం లేదు. మెదక్ జిల్లా చేగుంట మండలంలో సుమారు 150 మందికి పైగా సఫాయి కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి గత ఆర్నెల్ల నుంచి జీతాలు రావడం లేదు. కొన్ని గ్రామ పంచాయతీల్లో వారి బాధలు చూడలేక కార్యదర్శులు బయట అప్పుతెచ్చి రెండు, మూడు నెలల జీతాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకుంటున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలను నడపడం మునుపెన్నడూ లేనంత భారంగా మారిందని, పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేస్తే బాగుండేదని కార్యదర్శులు అంటున్నారు. రోజూ శుభ్రం చేసి, ఊరులోని చెత్తను తొలిగిస్తున్న తమకు జీతాలు చెల్లించాలని సఫాయి కార్మికులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

కత్తులు, గొడ్డళ్లతో దాడి

- భూవివాదంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ
- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం
- నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో ఘటన

అంకం అశోక్(ఫైల్)

నారాయణఖేడ్, మే 27: భూవివాదం కారణంగా చోటుచేసుకున్న ఘర్షణలో కత్తులు, గొడ్డళ్లతో దాడి చేయడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో జరిగింది. నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని 129 సర్వే నంబర్‌లోని రెండెకరాల భూమికి సంబంధించిన హద్దు విషయమై కొంతకాలంగా వివాదం కొనసాగుతుంది. ఈ క్రమంలో సోమవారం దేవీ సింగ్, బాబుగొండ, తుకారాంలతో పాటు మరికొందరు కలిసి ఆ భూమిలోని చెట్లను నరికి తరలిస్తుండగా అదే గ్రామానికి చెందిన అంకం లక్ష్మయ్య(60), రాములు (65), అంకం అశోక్(40)లు అడ్డుకోవడంతో ఘర్షణ మొదలైం ది. ముగ్గురిపై కత్తులు, గొడ్డళ్లు, కట్టెలతో దాడికి పాల్పడడంతో అశోక్, రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే నారాయణఖేడ్ ఏరియా దవాఖానకు తరలించారు. అశోక్ చికిత్స పొందుతూ మృతిచెందగా, మెరుగైన వైద్యం కోసం రాములును సంగారెడ్డి సర్కారు దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విద్యాచరణ్‌రెడి తెలిపారు.

చేర్యాలలో ఓటు వేసిన యువతులు

రాముడి అలంకరణకు దుబ్బాక చేనేత వస్త్రం

దుబ్బాక టౌన్, మే 27: సిద్దిపేట జిల్లా దుబ్బాక చేనేత వస్త్ర ఖ్యాతి దేశం నలుమూలల విస్తరించింది. నూతన వస్త్ర డిజైన్లకు అనుగుణంగా తయారుచేస్తూ ప్రశంసలు దుబ్బాక చేనేత కార్మికులు పొందుతున్నారు. సాక్షాత్తు అయోధ్య శ్రీరామచంద్రుడే దుబ్బాక చేనేత వస్త్రాన్ని ధరించి మరింత ఖ్యాతిని విస్తరింపజేశాడు. వారం రోజుల పాటు రోజుకో రంగుతో తయారైన వస్త్రాన్ని శ్రీరాముడికి అలంకరించేందుకు అర్డర్‌ను అందుకున్నారు. దుబ్బాకలో ఏర్పాటైన దుబ్బాక హైండ్ల్యూస్ కంపెనీలో తయారైన లినెన్ ఇక్కత్ చేనేత వస్త్రాన్ని (పింక్ కలర్) ఆదివారం ఆయోధ్య రాముడికి అలంకరించి ప్రశంసలు అందుకున్నట్లు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బోడ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... అయోధ్య రాముడి అలంకరణకు తాము తయారు చేస్తున్న లినెన్ వస్త్రాలు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి సోమవారం నుంచి ఆదివారం వరకు వివిధ రంగులతో తయారు చేసిన వస్త్రాలను రాముడికి అలంకరించేందుకు ఢిల్లీకి చెందిన డిజైనర్ మనీశ్‌త్రిపాఠి ఎంపిక చేస్తారని ఈ క్రమంలో దుబ్బాకలో తయారైన లినెన్ చేనేత వస్త్రం డిజైన్లు నచ్చి తమ కంపెనీకి అర్డర్ ఇచ్చారని శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం రెండు రంగులతో కూడిన రెండు డిజైన్ లినెన్ ఇక్కత్ వస్త్రాలను అందించడం జరిగిందన్నారు. ప్రతి వస్త్రం 12 మీటర్ల పొడవు ఉంటుందన్నారు. ఆదివారం శ్రీరాముడికి పింక్ కలర్ వస్త్రాన్ని అలంకరణ చేసే నిబంధన ఉండటంతో తాము తయారు చేసిన పింక్ కలర్ వస్త్రాన్ని రాముడికి అలంకరించినట్లు డిజైనర్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు సమాచారం అందించారన్నారు. మరో ఐదు రోజులకు ఐదు డిజైన్లతో కూడిన వస్త్రాలను తయారు చేసి అందజేయనున్నట్లు చైర్మన్ బోడ శ్రీనివాస్ తెలిపారు. గత ఫిబ్రవరిలో ఢిల్లీలో జాతీయ స్థాయిలో కేంద్ర చేనేత, జౌళీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విరాసత్ పేరిట చేనేత చీరల ప్రదర్శనలో దుబ్బాకలో తయారైన లినెన్ చీరకు స్థానం దక్కి దుబ్బాక చేనేత కార్మికులు ప్రశంసలు పొందారు.